# శ్రీనివాస కళ్యాణం

-ఎం.వీరేశ్వరరావు

అది ఒక ప్రైవేట్ కంపెనీ.

పేరు పరమ్ ప్రైవేట్ లిమిటెడ్.

కానీ స్టాఫంతా 'పరమ్ పెయిన్స్ ప్రైవేట్ లిమిటెడ్' అని పిలుచుకుంటారు. అక్కడ కష్టాలు అలా ఉంటాయి.

ఆరోజు ఉదయం పదిగంటలు.

పరమ్ పెయిన్స్‌లో రిసెప్షన్ దగ్గర మేనేజ్‌మెంట్ రికమెండేషన్ క్యాండిడేట్ వామనరావు కూర్చున్నాడు.

ఫోన్ కాల్స్ రిసీవ్ చేసుకుంటున్నాడు.

పదకొండు గంటలకి ఒక అమ్మాయి వచ్చింది.

ఆ అమ్మాయి పేరు శ్రీనిధి. వయసు ఇరవై పైన ఉంటుంది.

"శ్రీనివాస్‌గారు ఉన్నారా?" అని తియ్యగా పలికింది.

"ఏ శ్రీనివాస్ అమ్మా" అడిగాడు వామనరావు.

"శ్రీనివాస్ కావాలండి!" మళ్ళీ అందా అమ్మాయి.

"చూడమ్మా శ్రీనివాస్ అంటే సరిపోదు. ఇక్కడ ఆర్.శ్రీనివాస్ ఉన్నాడు, టి.శ్రీనివాస్ ఉన్నాడు. జె.శ్రీనివాస్ ఉన్నాడు. ఇలా ఆఫీసు ఎ టూ జెడ్ శ్రీనివాస్‌లతో కిటకిటలాడిపోతోంది. నీకే శ్రీనివాస్ కావాలి" అడిగాడు వామనరావు విసుగ్గా.

"కంప్యూటర్‌లో పనిచేసే శ్రీనివాస్ కావాలండి"

"చూడమ్మా అందరూ కంప్యూటర్ దగ్గరే పనిచేస్తారు. ఇంతకీ ఏ శ్రీనివాస్ కావాలి? ఏసీ రూంలో ఉండి కంప్యూటర్ నొక్కే శ్రీనివాస్ కావాలా? కంప్యూటర్ మీద ఒక వేలు ఉంచి, రెండో వేలు ముక్కుమీద ఉంచే శ్రీనివాస్ కావాలా?

సునీత కంప్యూటర్ కొడుతుంటే "నేను హెల్ప్ చేస్తాను" అంటూ వెర్రి నవ్వు నవ్వి ఆ వంకతో సునీత వేళ్ళు తాకే శ్రీనివాస్ కావాలా? ఏ శ్రీనివాస్ కావాలి" అడిగాడు వామనరావు.

ఇదేదో గందరగోళంగా ఉందని "కళ్ళజోడు శ్రీనివాస్ అండి" అంది.

"కళ్లజోడు శ్రీనివాస్ అంటే ఎలా? గోల్డ్‌ఫ్రేమ్ ఉన్న శ్రీనివాస్ కావాలా? సోడాబుడ్డి అద్దాలున్న శ్రీనివాస్ కావాలా? నల్లకళ్లజోడు శ్రీనివాస్ కావాలా?

'ఓవెల్ షేప్' ఉన్న అద్దాలు ధరించే శ్రీనివాస్ కావాలా? ఏ శ్రీనివాస్ కావాలి?" అడిగాడు వామనరావు.

శ్రీనిధికి శ్రీనివాస్ వ్యవహారంతో విసుగు వచ్చింది.

"చూడండి. మీ ఆఫీసులో ఉన్న శ్రీనివాస్‌లందర్నీ వరుసగా లైనులో నిలబడమనండి. నాకు కావాల్సిన శ్రీనివాస్‌ని గుర్తిస్తాను" అంది శ్రీనిధి.

"చూడమ్మా. ఇదేమన్నా పోలీస్‌స్టేషన్ అనుకున్నావా? అనుమానితుల్లా వరసగా నిలబడడానికి కంపెనీ అమ్మా. కంపెనీ. ఇక్కడ కొన్ని రూల్స్ ఉంటాయి" అన్నాడు వామనరావు.

"ఒక పనిచేద్దాం. ఒక్కో శ్రీనివాస్‌ని రిసెప్షన్ దగ్గరకు రమ్మంటాను. నువ్వే గుర్తించు" అన్నాడు వామనరావు.

లోపలినుంచి ఒక తెల్లని కుర్రాడు 'శ్రీనివాస్' వచ్చాడు.

చేతిలో ఫ్లాపీ ఉంది. "ఆ పాపి సరైన ఫ్లాపీ ఇవ్వలేదు. ఎండీ తిడుతున్నారు" అంటూ గొణుగుతున్నాడు.

"చూడు బాబూ శ్రీనివాస్ ఈ అమ్మాయి మీ రిలేషన్ అంటోంది. కనుక్కో" అన్నాడు వామనరావు.

శ్రీనివాస్ ఆ అమ్మాయిని చూసి "వావ్... రిలేషన్ అయితే ఎంత బాగుండును" అని కన్ను కొట్టి బయటికి పోయాడు.

"ఈ పోకిరి కాదు లెండి" అంది శ్రీనిధి.

"అబ్బాయి ఫోటో ఉందా?"

"లేదండి"

"మా ఊరికి టికెట్ ఇవ్వండి అన్నాడట వెనుక టికొకడు అలా ఉంది. వివరాలు లేకుండా ఎలా? ఒక పనిచేస్తాను మైక్‌లో శ్రీనిధి అనే అమ్మాయి అమలాపురం నుండి వచ్చింది. ఆమె చుట్టం శ్రీనివాస్ ఈ కంపెనీలో ఉంటే రిసెప్షన్ దగ్గరకు రావాలి" అని గట్టిగా చెప్పాడు.

అప్పుడు డిస్పాచ్ సెక్షన్ నుంచి ఎ.శ్రీనివాస్ బయటపడ్డాడు.

★ ★ ★

సాయంత్రం ఎ.శ్రీనివాస్ ఇంటిదగ్గర వాతావరణం చల్లగా ఉంది.

"చూడు నిధి. ఇంకా మన పెళ్ళికి రెండేళ్ళు పడుతుంది. కొంచెం ఓపిక పట్టాలి"

"నాకు అంత టైం లేదు. ఈనెలలో పెళ్ళి చేసుకున్నావా సరేసరి లేదా చూస్కో ఏం చేస్తానో?" అంది శ్రీనిధి.

★ ★ ★

ఎ.శ్రీనివాస్ శ్రీనిధి దూరపుచుట్టం. ఎనిమిదవ తరగతి నుంచి గాఢంగా ప్రేమిస్తున్నాడు. శ్రీనివాస్ స్వయంకృషి శూరుడు. తన డబ్బుతో పెళ్ళికి, కాపురానికి కావలసిన వస్తువులు సమకూర్చుకుంటున్నాడు.

ఒక ఏడాది టీవీ, మరొక ఏడాది కుక్కర్, ఒక ఏడాది మిక్సీ ఇలా కొంటున్నాడు. అత్తవారి వైపు వారు ఇస్తామన్నా వద్దన్నాడు. చదువుకునే రోజుల్లో కూడా తన పాకెట్ మనీ కథల ద్వారా సంపాదించేవాడు.


ఇంకా తన సొంత డబ్బుతో డబుల్‌కాట్ కొనాలి.

ఇంకో ఏడాది 'సుజుకి' కూడా కొనాలి. రిఫ్రిజిరేటర్ ఉంది కొనవలసిన లిస్టులో.

ఇలా అన్నీ స్వయంకృషితో కొని ఎప్పుడు

పెళ్ళి చేసుకుంటాడా? అన్న సందేహం పట్టుకుంది. తన బాధ వామనరావుతో చెప్పుకుంది శ్రీనిధి.

"నీకెందుకు? నీ ప్రాబ్లం సాల్వ్ చేస్తాగా?" భరోసా ఇచ్చాడు వామనరావు.




"చూడు శ్రీనివాస్ ఇలా అన్నీ స్వయంకృషితో కొని నువ్వు పెళ్ళి చేసుకుని సంసారం ప్రారంభించేసరికి సంసారానికి పనికిరాకుండా పోతావు?" అన్నాడు వామనరావు.

"సమరమో, స్వయం ప్రకాషో ఉంటారు కదండి మన కాపురాల్ని బాగుచేయడానికి" చెప్పాడు శ్రీనివాస్.

"సరైన సమయంలో పెళ్ళి చేసుకోకపోతే అంటే యవ్వనం కాటేసే సమయంలో కాకుండా యవ్వనం దాటేసే సమయంలో చేసుకుంటే ఏజ్ బార్ అయ్యి మార్కెట్ వాల్యూ తగ్గి రెండో పెళ్లి వాళ్ళో, మొగుడు వదిలేసినవాళ్ళో, మొగుడ్ని చంపేసినవాళ్ళో దొరుకుతారు. ఎడ్జస్టవ్వాలి. సంసారంలో సర్దుబాటు రాగాన్ని ఆలపించాలి. అందుకని త్వరగా శ్రీనిధిని పెళ్ళిచేసుకో"


"ఇంకా కొనవలసిన లిస్టులో డబుల్‌కాట్, రిఫ్రిజిరేటర్, స్కూటర్ ఉన్నాయి. ఎలా లేదన్నా రెండేళ్ళు పడుతుంది" అన్నాడు శ్రీనివాస్.

"మామగారు ఇస్తారు కదా! చాదస్తం



## ఇష్టం ఉండదు

తారల్లో చాలామంది షూటింగ్‌లకి లేట్‌గా రావడం, టేక్‌లమీద టేక్‌లు తీసుకోవడం చేస్తుంటారు. ఇలాంటివి తనకిష్టం లేదంటోంది ఈషా డియోల్. 'మేకప్ మీద మేకప్‌లు వేయించుకోవడం, షూటింగ్ స్పాట్‌లో అటూ ఇటూ తిరగడం అంటే నాకిష్టం ఉండదు. మేకప్ వేయించుకుని కాసేపు ఏసీ రూమ్‌లో రిలాక్స్ అయి వెంటనే షూటింగ్‌కి హాజరవ్వడం, సాధ్యమైనంత తక్కువ టేక్‌ల్లో షూటింగ్ పూర్తిచేసుకుంటాను. ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళితే మనకే మంచిది' అంటోంది ఈషా.




ఎందుకు?'' అన్నాడు వామనరావు.

"స్వయంకృషి'' అన్నాడు శ్రీనివాస్.

వామనరావు తల పట్టుకున్నాడు.

అతని బుర్రలో ఐడియా మెరుపులా మెరిసింది.

* * *

వారంరోజుల తర్వాత ఒక శుభలేఖ అందింది ఎ.శ్రీనివాస్‌కి.

శుభలేఖ మీద 'శ్రీనివాస్ వెడ్స్ శ్రీనిధి' అని ఉంది.

"ఇదేమిటి నా పెళ్ళి నాకు తెలియకుండా జరిగిపోతోంది?'' అన్నాడు శ్రీనివాస్.

"అదేమరి తొందరంటే. శ్రీనివాస్ అంటే ఎ.శ్రీనివాస్ కాదు, కె.శ్రీనివాస్. కె.శ్రీనివాస్ వెడ్స్ శ్రీనిధి. కె.శ్రీనివాస్ అదృష్టవంతుడు'' అన్నాడు వామనరావు.

"అదేమిటి? ప్రేమించానంది. ఎదురుచూస్తానంది. ఇప్పుడిలా ఎందుకు చేసిందబ్బా?'' అన్నాడు శ్రీనివాస్.

"ఎదరబ్రతుకంతా చిందరవందర అని అనుకుంటే ఎదురు ఎందుకు చూస్తుంది?'' అడిగాడు వామనరావు.

"ఈరోజే అమలాపురం వెళ్ళి తేల్చుకుంటాను'' అని గట్టిగా నిర్ణయించుకున్నాడు ఎ.శ్రీనివాస్.

* * *

శ్రీనివాస్ శ్రీనిధి నాన్నగారు వెంకట్రావుని కలిశాడు.

"ఇది అన్యాయం. నా పెళ్ళి శ్రీనిధితో చెయ్యాలి''

"చాల్లే. స్వయంకృషితో ఒక ఏడాది బకెట్, రెండో ఏడాది వంటసామాన్లు, మూడో ఏడాది కుక్కర్...ఇలా పంచవర్ష ప్రణాళికల అల్లుడు నాకొద్దు'' కోపంగా అన్నాడు వెంకట్రావు.

చాదస్తానికి పోతే శ్రీనిధి సన్నిధి జారిపోయేలా ఉందే అనుకుని "నేను శ్రీనిధిని పెళ్ళిచేసుకుంటాను'' అన్నాడు.

"ఎందుకు బాబు వద్దులే. అమెరికా కుర్రాడు కె.శ్రీనివాస్ ఇష్టపడుతున్నాడు. నాలుగో తారీఖు పెళ్ళి. పదిన అమెరికా ప్రయాణం. అంతా ఫాస్ట్. నీలాకాదు''

"ఏంటండి? మీరు వేరే సంబంధం చూస్తుంటే చేతగాని వాడిలా చూస్తూ ఊరుకుంటానా? ఎత్తుకుపోయి పెళ్ళి చేసుకుంటాను. ఎంత దీర్ఘప్రేమ నాది. ఎనిమిదవ తరగతి నుండి ప్రేమిస్తున్నాను'' అన్నాడు గంభీరంగా శ్రీనివాస్.

"వద్దులే. అమ్మాయి! అమెరికా శ్రీనివాస్ ఎప్పుడు వస్తున్నాడు?''

"మధ్యాహ్నం నాన్నా'' బదులిచ్చింది శ్రీనిధి.

"ఈ క్షణమే గుళ్ళో పెళ్ళిచేసుకుంటా'' అంటూ శ్రీనిధి చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

"శభాష్ అల్లుడూ! ఈ ఘడియ కోసమే ఈ శుభలేఖ నాటకం. శుభలేఖ నీకొక్కడికే వచ్చింది నిన్ను రప్పించడానికి. ఇదంతా నాఫ్రెండ్ వామనరావు సలహా'' అన్నాడు వెంకట్రావు.

శ్రీనిధి సిగ్గుతో తలదించుకుంది.

శ్రీనివాస్, శ్రీనిధిల కళ్యాణం వైభవంగా జరిగింది.

* * *

"హనీమూన్‌కి ఎక్కడికి వెడుతున్నావు?'' శ్రీనివాస్‌ని పలకరించాడు వామనరావు.

"తిరుపతి అండి!''

"తిరుపతా? ఏ బెంగుళూరో, మైసూరో వెళ్ళవచ్చు కదా!''

"మా బామ్మ మొక్కుకుందండి. నా పెళ్ళయి తన కళ్ళచూస్తే నా తలనీలాలు ఇస్తానని మొక్కుకుందండి''

"అవునులే ముసలావిడ నీ చాదస్తం చూసి నీ పెళ్ళి చూడకుండా పోతానని అనుకుని ఉంటుంది'' అన్నాడు వామనరావు.

"సరే శ్రీనూ! పిల్లాడు పుడితే ఏ పేరుపెడతావు?''

"శ్రీనివాస్ అండి''

అంతే...

ఆ జవాబు విని అప్పటికే 'శ్రీనివాస్'లతో కన్‌ప్యూజ్ అయ్యి బుర్ర పాడయ్యిన వామనరావు దబ్‌మని నేలమీద పడ్డాడు.

"వద్దు బాబూ నీ కాళ్ళు పట్టుకుంటా నీ హనీమూన్ ఖర్చు కంపెనీ ఎక్కౌంట్‌లో నుండి ఇప్పిస్తా.

ఆ పేరు మాత్రం పెట్టుకోకు బాబూ'' అని శ్రీనివాస్ కాళ్ళు పట్టుకున్నాడు వామనరావు.

"లేవండి. శ్రీకర్ అని పెట్టుకుంటా'' అన్నాడు శ్రీనివాస్.

"హమ్మయ్య'' అని హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు వామనరావు.

★